క్లుప్తంగా

సాగునీరు అందజేయాలని విజ్ఞప్తి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం సరియాబొడ్డపాడు, శ్రీజగన్నాథపురం పంచాయతీ పరిధిలో పంట పొలాలకు సాగునీరు అందజేయాలని రైతులు మెట్ట శాంతారావు, సనపల కృష్ణమూర్తి, ధర్మారావు, అప్పలనాయుడు, ప్రకాశరావు, భాస్కరరావు కోరారు. 29-ఆర్, 30-ఆర్ సాగునీటి కాలువల గుండా ఇటీవల నీరు విడుదల చేసి ఆకస్మికంగా ఆపేశారని వాపోయారు. దీంతో సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. అధికారులు స్పందించి తక్షణమే సాగునీరు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇష్టారాజ్యంగా రోడ్డు పనులు

టెక్కలి: టెక్కలి భవానీనగర్ నుంచి జాతీయ రహదారి వరకు చేపడుతున్న పనులను అధికారుల పర్యవేక్షణ చేయకపోవడంతో ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు దాడి ధర్మారావు పేర్కొన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. రెండు విభాగాలుగా జరుగుతున్న పనుల్లో నిబంధనల మేరకు వేయాల్సిన మెటీరియల్‌ను సక్రమంగా వేయడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి భవానీనగర్ రోడ్డు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

నాగుపాము హల్‌చల్



చనిపోయిన పాము

వజ్రపుకొత్తూరు రూరల్: మండల కేంద్రమైన వజ్రపుకొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాగుపాము సోమవారం చొరబడింది. దీంతో సిబ్బంది భయాందోళన చెందారు. స్థానికంగా ఉన్న కొంత మంది పాముని బయటకు పంపించే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యం కాలేదు. బుసలుకొడుతూ హల్‌చల్ చేసింది. దీంతో కర్రలతోకట్టి హతమార్చారు.

వైఎస్సార్‌సీపీ నేతకు సత్కారం



నరేంద్ర యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నర్తు నరేంద్రయాదవ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కంచిలి మండలం పెద్దశ్రీరాంపురం పంచాయతీకి సోమవారం వచ్చారు. దీంతో ఆయన మండల పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి ఉన్నారు.

అక్రమ నిర్మాణంతో విద్యార్థులకు సమస్య



మున్సిపల్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న స్కూల్ కమిటీ సభ్యులు

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకొని అక్రమంగా నిర్మిస్తున్న ఆటో స్టాండ్ వల్ల విద్యార్థులకు సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని పాఠశాల కమిటీ సభ్యులు అన్నారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులకు సోమవారం వినతి పత్రం ద్వారా తెలియజేసారు. నిర్మాణానికి సమీపంలోనే విద్యార్థినుల మరుగుదొడ్లు ఉన్నాయన్నారు. తక్షణమే ఆటో స్టాండ్ నిర్మాణాన్ని నిలిపి వేయాలని కోరారు.



ఎటువంటి స్పీడ్ బ్రేకర్లు లేని ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్



తరచూ ప్రమాదాలు జరుగుతున్న సోగ్గాడిపేట జంక్షన్

డేంజర్ జంక్షన్‌లు..!

- టెక్కలి పాత హైవేలో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు

టెక్కలి: టెక్కలి పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే పాత జాతీయ రహదారిలో కొన్ని ప్రధానమైన జంక్షన్లు ప్రమాదకరంగా మారాయి. వీటి వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనదారులు మితిమీరిన వేగంతో రావడంతో కొన్ని జంక్షన్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో స్థానికులు హడలిపోతున్నారు. స్థానికులు కొంతమంది అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు వేయకపోవడం వలన ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు రోడ్డు దాటే క్రమంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పొంచిఉన్న ప్రమాదం..

డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని సోగ్గాడిపేట జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఇందిరాగాంధీ జంక్షన్‌తో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ డిపో జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు లేవు. దీంతో రోజూ ఏదో ఒక జంక్షన్ వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన జంక్షన్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



స్పీడ్ బ్రేకర్లు లేని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంక్షన్

స్పీడ్ బ్రేకర్లు వేయాలి..



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ఎంజేపీ పాఠశాల జంక్షన్ వద్ద రోడ్డు దాటాలంటే భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ కచ్చితంగా స్పీడ్ బ్రేకర్లు ఉండాలి. విద్యా సంస్థలను దృష్టిలో ఉంచుకుని ఈ జంక్షన్‌తో పాటు ఆర్టీసీ డిపో జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలి.

-పి.వైకుంఠరావు, స్థానికుడు, టెక్కలి

రోడ్డు దాటాలంటే భయమే..



సోగ్గాడిపేట జంక్షన్ వద్ద నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. అన్నిమార్గాల నుంచి వేగంతో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు స్పందించి ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

-పి.రమణబాబు, వార్డు సభ్యుడు, సోగ్గాడిపేట, టెక్కలి

ఎరువుల కొరత తీర్చండి

- జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్సీ రామారావు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులు తీవ్రమైన ఎరువుల కొరతతో అల్లాడిపోతున్న నేపథ్యంలో తక్షణమే 1050 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు సమకూర్చాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. తక్షణమే 700 మెట్రిక్‌టన్నుల యూరియా, 175 మెట్రిక్ టన్నుల డీఏపీ, 150 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని విన్నవించారు. అలాగే జగతి, శిలగాం, గొర్లెపాడు జంక్షన్లను కలిపే జీఎస్‌జీ రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే గౌతు శిరీషపై చర్యలు తీసుకోవాలి

- వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్



సీఐ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పలాస: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌కు సోమవారం వెళ్లి సీఐ సూర్యనారాయణకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొద్దిరోజులుగా ఎమ్మెల్యే శిరీష మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఇష్టానుసారంగా దుర్భాషలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతని కులం గురించి ద్వేషిస్తూ సమాజంలో వివిధ కులాల మధ్య ఘర్షణలు కలిగించేవిధంగా మాట్లాడుతున్నారన్నారు. ఇలాంటి మాటలు వలన గ్రామాల్లో వివిధ వర్గాల మధ్య గొడవలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. శిరీష మాటతీరుపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో వైఎస్సార్‌సీపీ పలాస – కాశీబుగ్గ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టు గోపి, పట్టణ ఉపాధ్యక్షుడు గుజ్జు జోగారావు, నర్తు వెంకటరమణ, పలాస మండల కమిటీ అధ్యక్షుడు దువ్వాడ రవి, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, మందస ఎంపీపీ డొక్కర దానయ్య, దున్న హరికృష్ణ, తమ్మినేని వైకుంఠరావు, సేనాపతి కిషోర్, సాసర్త డిల్లేశ్వరరావు, తిర్ర రాజారావు, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, దువ్వాడ మధుకేశవరావు, మద్దిల హరినారాయణ, మచ్చ ధనరాజు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ధర్నా



మాకన్నపల్లిలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కాశీబుగ్గ: ప్రజల ధనాన్ని అదానికీ అప్పగించే కుట్రలో భాగంగా ప్రభుత్వం తెచ్చిన స్మార్ట్ మీటర్లను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం కార్యదర్శి ఎస్.గణపతి, నాయకులు తెప్పల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద జరగనున్న ధర్నాలు జయప్రదం చేయాలని కోరుతూ పలాస మండలం మాకన్నపల్లి పంచాయతీలోని అన్ని గ్రామాలలో సోమవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగిస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్పొరేట్ల లాభాల కోసం ప్రజలను బలిచేస్తారా అని ప్రశ్నించారు. సర్ చార్జిలు, ఇంధనపు చార్జిల పేరుతో ఇప్పటికే వేస్తున్న బిల్లుల భారం ప్రజలు మోయలేకపోతున్నారని అన్నారు. పెంచిన విద్యుత్ చార్జిలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రచారంలో సీపీఎం నాయకులు టి.రాజు, ఎం.రాజు, జుత్తు లోకనాథం, సంతోష్, రాజారావు పాల్గొన్నారు.



టెక్కలి ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సెల్‌ఫోన్లతో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పాత ఫోన్లతో పనిచేయలేం

- అంగన్‌వాడీ కార్యకర్తల ఆవేదన
- ఐసీడీఎస్ కార్యాలయానికి ఫోన్లు అప్పగింత

టెక్కలి: దశాబ్దాల క్రితం ఇచ్చిన ఫోన్లతో ఇప్పుడు పనిచేయలేకపోతున్నామని, తరచూ సాంకేతిక మరమ్మతులతో విధులు చేపట్టలేకపోతున్నామంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. టెక్కలి, కోటబొమ్మాళిలో అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం నిరసన తెలియజేశారు. ఫోన్లను ఐసీడీఎస్ కార్యాలయానికి అప్పగించారు. ఐసీడీఎస్ టెక్కలి ప్రాజెక్టు పరిధిలో సిబ్బంది సెల్ ఫోన్లతో నిరసన చేపట్టి వాటిని కార్యాలయానికి అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితం అందజేసిన ఫోన్లు ప్రస్తుతం సక్రమంగా పనిచేయడం లేదన్నారు. కొన్ని సందర్భాల్లో సాంకేతిక మరమ్మతులు చోటు చేసుకుంటున్నాయన్నార. అంతే కాకుండా ఫోన్లు ద్వారా కొన్ని రకాల యాప్‌ల నిర్వాహణపై ఉన్నతాధికారులు ఒత్తిళ్లు చేస్తుండడంతో తట్టుకోలేక ఫోన్లు అప్పగించినట్లు సిబ్బంది వెల్లడించారు.

సచివాలయంలో సిబ్బంది లేరు..!



టెక్కలి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలోని సచివాలయం-2లో సోమవారం సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వివిధ అవసరాల కోసం వచ్చిన వారంతా విస్తుపోయి వెనుదిరిగారు. మధ్యాహ్న సమయంలో కంప్యూటర్లు ఆన్ చేసి ఉన్నప్పటికీ సిబ్బంది మాత్రం కానరాలేదు. దీంతో వివిధ ప్రభుత్వ సేవల కోసం వచ్చిన వారంతా కొద్దిసేపు వేచిచూసి అసంతృప్తితో వెనుదిరిగారు.

-టెక్కలి

ఆశ కార్యకర్తల వినతి



తమపై అధికారులు, ఏఎన్‌ఎంల వేధింపులు ఆపాలని ఆశ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు స్థానిక యూపీహెచ్‌సీ అధికారులకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతిరావు మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలకు కూడా జాబ్ చార్ట్ ఉందని, దాన్ని అమలు చేయకుండా అదనపు పనులు అప్పగించడంతోపాటు వేధించడం సరికాదన్నారు. వేధింపులు ఆపకపోతే మండల వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సభిత పాత్రో, ఎల్.లక్ష్మి, జ్యోతి మహంతి, పుణ్యవతి, బి.స్వాతి, సుందరి పాల్గొన్నారు.

-కాశీబుగ్గ

జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి



వజ్రపుకొత్తూరు మండలంలో ప్రధాన రోడ్డులో ఒకటైన వజ్రపుకొత్తూరు- అక్కుపల్లి రోడ్డులో బాతుపురం నుంచి చినవంక పెదవంక గ్రామాల వరకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిని లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు మండల కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రమేష్‌నాయుడుకి వినతిపత్రం అందజేశారు. నిత్యం వాహనాల రాకపోకలు సాగించే ఈ రోడ్డుపైకి చెట్టు కొమ్మలు, పిచ్చి మొక్కలు వ్యాపించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.

-వజ్రపుకొత్తూరు రూరల్

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. 'సంపద లేని కేంద్రాలు' శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం యుద్ధప్రాతిపదికన ఈదుపురం, కేశుపురం, బొడ్డబడ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు. పనులను డిప్యూటీ ఎంపీడీవో ఎల్.వెంకటరావు, డాక్టర్ సంతోష్ చలమాజీ, పంచాయతీ కార్యదర్శి విజయకుమారీ, ఎంపీటీసీ సభ్యుడు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్ పర్యవేక్షించారు.

ఎల్‌పీఎం ఫీజు మినహాయింపు

ఇచ్ఛాపురం రూరల్: జాయింట్ ఎల్‌పీఎంల కోసం ఆన్‌లైన్ సబ్‌డివిజన్ సేవలకు స్వీకరించిన అన్ని దరఖాస్తులకు ఆరు నెలల కాలానికి ఒకేసారి ఫీజు మినహాయింపును మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తహసీల్దార్ ఎస్.వెంకటరావు సోమవారం తెలిపారు. రీ సర్వే అయిన గ్రామాలలో రైతులు అందరూ ఈ విషయాన్ని గమనించి, కేవలం రూ.50 చెల్లించి, జాయింట్ ఎల్‌పీఎం ఆన్‌లైన్ సబ్ డివిజన్ కోసం దరఖాస్తు చేసుకోవడంతోపాటు సంబంధిత గ్రామ సర్వేయర్‌ని సంప్రదించాలని సూచించారు. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఇల్లు లేని పేద కుటుంబాలకు 'హౌసింగ్ ఫర్ ఆల్' పథకం కింద పక్కా ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా పట్టాలు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని అన్నారు. పట్టణ ప్రాంతాల వారికి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి మూడు సెంట్లు చొప్పున కేటాయిస్తామన్నారు.

కంప్యూటర్ వితరణ



ఉపాధ్యాయులకు కంప్యూటర్‌ను అందిస్తున్న శ్రీకాంత్

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట ఆదర్శ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన వంక శ్రీకాంత్ సోమవారం కంప్యూటర్ వితరణగా ఇచ్చారు. చాలా ఏళ్లుగా పాఠశాలకు కంప్యూటర్ అవసరమని ఉపాధ్యాయులు కోరుతున్నారు. సమస్యను శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి కంప్యూటర్‌ను సమకూర్చారు. దీన్ని ఉపాధ్యాయులకు అందజేశారు.

జిల్లాస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

ఇచ్ఛాపురం: నరసన్నపేటలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి యోగాసన పోటీల్లో ఇచ్ఛాపురం యోగక్రీడాకారులు ప్రతిభకనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. జాతీయ యోగాసన స్పోర్ట్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ట్రెడిషనల్, ట్విస్టింగ్ యోగాసన పోటీల్లో 28 నుంచి 35 ఏళ్ల కేటగిరీలో పట్టణానికి చెందిన శ్రీకాంత్‌మహంతి ప్రథమస్థానం సాధించగా, 14 నుంచి 18 ఏళ్ల విభాగంలో పాలేపు సాయి, జగదీష్ ప్రథమ, ద్వితీయ స్థానాలతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యోగ క్రీడాకారులను సోమవారం స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, స్థానిక యోగసాధకులు, క్రీడాకారులు అభినందించారు.

వంగపండుకు ఉరసం ఘన నివాళి



వంగపండు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పలాస: మాకన్నపల్లిలో ప్రముఖ జానపద వాగ్గేయ కారుడు వంగపండు ప్రసాదరావు వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఉద్దానం రచయితల సంఘం అధ్యక్షుడు కుత్తుం వినోద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వంగపండు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. స్వయంగా రాసి తన ఆటా పాటలతో ప్రజలను ఉర్రూతలూగించారని గుర్తు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు పొందిన కవి, కళాకారుడని చెప్పారు. కార్యక్రమంలో సినీ నటుడు డాక్టర్ కుమార్ నాయక్, రచయిత నిశితాసి, వంకల అప్పారావు, కె.ముకుందరావు, దుర్గాప్రసాద్, పోతనపల్లి వెంకటేష్, సైని మోహనరావు, దాసరి దానేశు, బత్తిన జగదీష్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు మేలు

ఇచ్ఛాపురం: పిల్లలకు తల్లిపాలు ఎంతోమేలు చేస్తాయని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్యాధికారి పి.దేవేంద్రరెడ్డి అన్నారు. ఆస్పత్రి ఆవరణలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నెహ్రూ యువజన కేంద్రం, మేరా యువభారత్ అధ్వర్యంలో బాలింతలు, గర్భిణులు, మహిళలకు తల్లిపాల విశిష్టత గురించి వైద్యురాలు శిల్ప వివరించారు. నెహ్రూయువజన కేంద్ర మేరా యువభారత్ ప్రతినిధి హంగీర్‌బెహర, అంగన్‌వాడీ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసం.. చంద్రబాబు నైజం!



పలాస: మాకన్నపల్లిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల సందర్భంగా సూపర్‌సిక్స్‌తోపాటు 143 హామీలను ఇచ్చిన కూటమి నాయకులు వాటిలో ఎన్నింటిని పూర్తిస్థాయిలో అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంక్షేమం, అభివృద్ధిని కనీసం పట్టించుకోలేదన్నారు. అలాగే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎంతో బాగా నడిచిన విద్య, వైద్య రంగాలను కూడా నిర్వీర్యం చేశారన్నారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను తెలియజేసే క్యూఆర్‌కోడ్ పత్రాలను పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కోటబొమ్మాళి మండలం జర్జంగి పంచాయతీలో బాబ వైఫల్యాలను ప్రచారం చేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు హేమసుందర్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, నాయకులు



కంచిలి: పెద్దశ్రీరాంపురం పంచాయతీలో క్యూఆర్ కోడ్ పత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 14, 15 వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ పార్టీ నాయకులు



సంతబొమ్మాళి: చెట్లతాండ్ర, అరికవలసలో పాల్గొన్న పార్టీ మండల అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి తదితరులు